ఏనెబావిలో రోడ్డును పరిశీలించిన ఆర్డీవో

లింగాలఘనపురం, జూలై 27 : రోడ్డు నిర్మాణ పనులను రైతులు అడ్డుకుంటుండంతో ఆ రోడ్డును జనగామ ఆర్డీవో కొమురయ్య శనివారం పరిశీలించారు. వివరాల్లోకి వెళితే... ఏనెబావిలో టెక్స్‌టైల్స్ పార్కును ఏర్పాటు చేస్తుండడంతో కంపెనీకి వెళ్లే భారీ వాహనాలకు ఇబ్బంది లేకుండా పెంబర్తి నుంచి ఏనెబావికి డబుల్‌బీటీ రోడ్డు వేస్తున్నారు. ఏనెబావిలో గత రోడ్డు ఇరుకుగా ఉండడంతో 700 మీటర్ల మేర బైపాస్ వేయాలని, ఆ ఖర్చులు తామే భరిస్తామని టీఎస్ఐఐసీ అంగీకరించింది. ఈ నేపథ్యంలో ఏడుగురు రైతులు 3.20ఎకరాల భూమిని కోల్పోవాల్సి వస్తోంది. పలు దఫాలుగా చర్చలు జరిగినా రైతులు తమ భూములు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో ప్రభుత్వం ఎకరాకు రూ.14 లక్షల పరిహారం చెల్లిస్తామన్నా రైతులు ఒప్పుకోకున్నా సీసీఎల్ఏలో నష్టపరిహారం జమచేసింది. సమస్య జఠిలంగా మారడంతో ఆర్డీవో కొమురయ్య ఆ భూమిని సందర్శించి రైతులతో చర్చలు జరిపారు. ఈ నెల 30న జనగామలోని తమ కార్యాలయానికి రావాలని మరోమారు చర్చిద్దామని తెలిపారు. తహసీల్దార్ వినయలత, ఆర్ఐ కిశోర్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, డీఈ స్మరత్ చంద్ర, ఏఈ ఆలోజి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగం పై డీఎల్‌పీవో విచారణ

రఘునాథపల్లి, జూలై 27 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని గామానికి చెందిన రాకూర్ జ్ఞానేష్, మొగుళ్లపల్లి సంతోష్, శాడ శ్రీనివాస్ సీఎం ప్రజా దర్బార్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో పార్థసారథి శనివారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిర్యాదులో పేర్కొన్న నిధుల దుర్వినియోగం, అక్రమ నిర్మాణాలు, నకిలీ బిల్లులకు పాల్పడిన విషయంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, గ్రామ తాజా మాజీ సర్పంచ్ పోకల శివకుమార్ గ్రామ పంచాయతీలో అక్రమాలు జరుగలేదని, పాలనపరంగా నిధులను ఖర్చు చేశానని గతంలో అధికారులు విచారణ చేపట్టిన పత్రాలను డీఎల్‌పీవోకు అందించారు. మూడు రోజుల్లో విచారణ మళ్లీ చేపడుతానని స్పెషల్ ఆఫీసర్ రాజేందర్, ఎంపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి కవితకు సూచించారు.

అనుమతి లేకుండా చెట్టు నరికివేత

బచ్చన్నపేట, జూలై 27 : మండలంలోని పోచన్నపేట శివారు కాశీనగర్‌లో అనుమతులు లేకుండానే ఓ వృక్షాన్ని నరికేశారు. ఓ వ్యక్తి ఇష్టారాజ్యంగా మిషన్‌తో చెట్టును నరకడంపై పలువురు ఇదేంటని ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్టు నరికిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కాశీనగర్‌లో అక్రమంగా నరికివేసిన చెట్టు

లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడిగా మాచర్ల పుల్లయ్య

పాలకుర్తి రూరల్, జూలై 27: లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా మండలంలోని గూడూరు మాజీ సర్పంచ్ మాచర్ల పుల్లయ్యను ఎన్నుకున్నారు. క్లబ్ నూతన కార్యవర్గాన్ని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ రాపాక విజయ్ శనివారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా చిదురాల మహేందర్, కోశాధికారిగా పబ్బా సంతోష్‌ను నియమించారు.

మట్టి వినాయక విగ్రహాలతో ఏకశిల బీఈడీ కాలేజీ విద్యార్థినులు

మట్టి గణపతులను పూజిద్దాం

జనగామ, జూలై 27 (నమస్తే తెలంగాణ) : పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ కోసం గణపతి నవరాత్రి ఉత్సవాల్లో మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు విద్యార్థులు సిద్ధమయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఏకశిల బీఈడీ కళాశాల విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ కే సత్తయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ మర్రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య

పాలకుర్తి రూరల్, జూలై 27: ఆర్థిక ఇబ్బందులతోపాటు కుటుంబ కలహాలతో ఫర్టిలైజర్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎం సాయి ప్రసన్నకుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన సలేంద్ర సోమశేఖర్(32) ఫర్టిలైజర్ వ్యాపారం చేస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులకుతోడు కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన సోమశేఖర్ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318953

WANTED
jobs Apply Now!
★ Wanted PRO's for MBBS in Abroad Education. Please Contact Phone No. 8121554649.
NTW-314856

FOR SALE
★ Shop in Auto Nagar 45 Lakhs (Rs. 9000/- Getting Rent), House in Kasibugga 45 Lakhs (Rs. 6,200/- Getting Rent). Cont: 9492199961.
NTW-00

HEALTH CARE
★ ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం, క్యాన్సర్ పేషెంట్స్ కొరకు అవసరమగు 24 గం॥ల సేవలు అందించబడును.
సంప్ర : 6281476205, 9440325526
KMM-11867

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ఏనెబావిలో మొక్కలు నాటుతున్న అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

ఓబులకేశ్వాపూర్ హైస్కూల్‌లో మొక్క నాటుతున్న డీఈవో రాము

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

- ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలి
- వనమహోత్సవంలో అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్

లింగాలఘనపురం, జూలై 27 : మానవ మనుగడకు మొక్కలే ఆధారమని, పర్యావరణ పరిరక్షణకు ఇవి ఎంతగానో దోహదపడుతాయని అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఏనెబావిలో శనివారం వనమహోత్సవం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. పింకేశ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, రహదారులకు ఇరువైపులా మొక్కలను నాటించాలని అధికారులను ఆదేశించారు. ఏనెబావిలో టెక్స్‌టైల్స్ పార్క్‌కోసం 136ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించిందన్నారు. నిబంధనల మేరకు ఇందులోని 13ఎకరాల్లో పచ్చదనం చేపట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వనమహోత్సవంలో రెండు వేల మొక్కలు నాటుతున్నామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు సంరక్షించాలని కోరారు. ఇది అందరు తమ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో మొగులప్ప, మండల స్పెషలాఫీసర్ లత, ఎంపీడీవో జలేందర్‌రెడ్డి, ఎంపీవో మల్లికార్జున్, ఇండస్ట్రీయల్ డీఈ శరత్‌చంద్ర, ఏఈ ఆలోజీ, ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కరుణాకర్, కారోబార్ మహేందర్, అంగన్‌వాడీ టీచర్ కవిత పాల్గొన్నారు.

మొక్కలతోనే జీవవైవిధ్యం : డీఈవో

జనగామ రూరల్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా జీవవైవిధ్యాన్ని పెంపొందించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కే రాము అన్నారు. శనివారం మండలంలోని ఓబుల్ కేశ్వాపూర్ హైస్కూల్‌లో శిక్షా సప్తాహంలో భాగంగా మొక్కలు నాటారు. రాము మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతతోనే శబ్దకాలుష్యం తగ్గుతుందన్నారు. అనంతరం సమావేశంలో హిందీ భాష నైపుణ్యాలను పెంపొందించాలని ఉపాధ్యాయులను కోరారు. హెచ్ఎం వీరాంజని, ఏఎంవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : స్వచ్ఛమైన గాలితోనే ఆరోగ్యంగా ఉంటామని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ కలుషితమైన వాతావరణంతోనే వ్యాధుల బారిన పడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సంధ్య, జనార్ధన్, ప్రదీప్‌కుమార్, సంధ్యారాణి, అజయ్, సీహెచ్‌వో సాంబయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు

రఘునాథపల్లి, జూలై 27: నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాదించవచ్చని డీఏవో వినోద్‌కుమార్ సూచించారు. మండలంలోని శ్రీమన్నారాయణపురంలో శనివారం రైతులకు పంటసాగు, రుణమాఫీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి బిల్లు రశీదు తీసుకోవాలని అన్నారు. పంటసాగుకు రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. రుణమాఫీ అయిన రైతులు బ్యాంకులకు వెళ్లి కొత్త రుణాలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సుస్మిత, రైతులు మాచర్ల శ్రీనివాస్, కొమురజీ, రాంనర్సయ్య, భిక్షపతి, యాదగిరి, సిద్ధిరెడ్డి, మహేందర్, వీరస్వామి, భాస్కర్, శ్రీను, సత్తయ్య, బీరయ్య పాల్గొన్నారు.

మద్యనిషేధం అమలు చేయాలని తీర్మానం

రమునాథపల్లి, జూలై 21 : పతేషాపూర్‌లో మద్యం అమ్మొద్దని శనివారం గ్రామస్తులు తీర్మానించారు. యువత మద్యానికి బానిసలుగా మారి తమ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారని భావించిన గ్రామస్తులు శనివారం గ్రామసభ నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, వ్యవసాయ అధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మహిళలు, యువకులు, మాజీ ప్రజాప్రతినిధులు కలిసి మద్యనిషేధం అమలు చేయాలని, ఎవరైనా అమ్మితే జరిమానా విధించాలని తీర్మానించారు. పంచాయతీ కార్యదర్శి మహేశ్, మహేందర్ నాగరాజు, యాకూబ్, అజయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌పై బీజేపీ శ్రేణుల నిరసన

పాలకుర్తి, జూలై 27: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని బీజేపీ జిల్లా నాయకుడు కమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, మండల అధ్యక్షుడు దుంపల సంపత్ ఆన్నారు. ప్రజల ఆశలను నీరుగార్చిన ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడుదుల నీరంజన్‌రెడ్డి, పెనుగొండ సోమేశ్వర్, వేల్పుల దేవరాజ్, పట్టణ అధ్యక్షుడు పబ్బ సంతోష్ , మండల ఉపాధ్యక్షుడు కమ్మగాని నరేష్, ఈర్ల రాజు, ఘనగాని రాజు పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

జనగామ, జూలై 27 (నమస్తే తెలంగాణ) : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని ఆ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈనెల 29, 30, 31 తేదీల్లో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ చంద్రశేఖర్ అజాద్‌ను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్‌తో రైతులకు మేలు

జిల్లా ఉద్యాన అధికారి కేఆర్ లత

ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న లత

బచ్చన్నపేట, జూలై 27 : రైతులు వ్యవసాయంతోపాటు ఆయిల్‌పామ్ సాగుకు ప్రాధాన్యమిస్తే ఆర్థికంగా ఎదగవచ్చని జిల్లా ఉద్యానవనశాఖ అధికారి కేఆర్ లత అన్నారు. శనివారం మండలంలోని పోచన్నపేటలో చింతల అప్పర్ణ, రమ్యకు చెందిన 14ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా లత మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రైతులు వరితోపాటు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు వస్తున్నారని వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించే ఆయిల్‌పామ్‌తో ఆర్థికంగా ప్రయోజనం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ జిల్లా ఇన్‌చార్జి హెడ్ సస్, హార్టికల్చర్ అధికారి రవికాంత్, ఏవో హారిక, ఫీల్డు ఆఫీసర్ శశి, రైతులు బాలచందర్, మల్లేశ్, నారాయణ, బాలయ్య, శివరాములు, ఐలయ్య, కిష్టయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

బచ్చన్నపేట, జూలై 27 : రాష్ట్ర బడ్జెట్‌లో జనగామ ప్రాంతానికి సున్నా చూపించారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరువు, దుర్భిక్ష ప్రాంతమైన జనగామపై కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో వివక్ష చూపడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్డు

9వ వార్డులో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

రఘునాథపల్లి, జూలై 27 : కంచనపల్లిలో ని 9,10 వార్డులోని కెమిడి వీ రస్వామి ఇంటి నుంచి శివాజీనగర్‌కు వెళ్లే సీసీ రోడ్డు వరకు ఉన్న రోడ్డుపై వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బురద రోడ్డుపై నాట్లేసి నిరసన

బురదలో నాటు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

తరిగొప్పుల, జూలై 27: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండల కేంద్రం నుంచి అంకుషాపూర్, బంజర్‌పల్లి తండాలకు వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. అధికారులు మరమ్మతు చేయకపోవడంతో శనివారం బీజేపీ యువమోర్చా నేతృత్వంలో రోడ్డుపై నాట్లేసి నిరసన తెలిపారు. సంఘం మండల అధ్యక్షుడు జంగా వీరాకుమార్ మాట్లాడుతూ రోడ్డుపై బురదతోపాటు గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెద్దమేన రాజు యాదవ్, కొన్నె రాజు, రాంబ్రహ్మచారి, గుగులోత్ అనిల్ పాల్గొన్నారు.

సత్యనారాయణ యాదవ్‌ను సన్మానిస్తున్న పాడి రైతులు

పాడి గేదెలతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 27 : బ్యాంకు రుణాలతో పాడి గేదెలను తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని విజయ డెయిరీ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణయాదవ్ రైతులను కోరారు. శనివారం డివిజన్ కేంద్రంలోని పాలశీతల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. సత్యనారాయణయాదవ్ మాట్లాడుతూ విజయ డెయిరీకి పాలు పోసే రైతులకు శ్రీనిధి ద్వారా రెండు పాడి గేదెలను అందించేందుకు జిల్లా కలెక్టర్ కృషి చేస్తున్నారని తెలిపారు. బిజిల్లా మేనేజర్ కే హరికృష్ణ, స్టేషన్ ఘన్‌పూర్ మేనేజర్ లింగారెడ్డి, శివప్రసాద్, సూపర్‌వైజర్ ఉదయ్, నీల రామన్న పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి రిమాండ్

దేవరుప్పుల, జూలై 27: దాడి కేసులో ఇద్దరికి జనగామ కోర్టు శనివారం 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీత్యాతండాలో ఈ నెల 4న గుగులోత్ మాన్‌సింగ్ అతడి తల్లి తారమ్మను అదే గ్రామానికి చెందిన గుగులోత్ ఉపేందర్, దేవేందర్ కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈ నెల 5న కేసు నమోదు చేయగా పరారీలో ఉన్న నిందితులను శనివారం కోర్టులో హాజరుపరచినట్లు ఎస్సై తెలిపారు. విచారణ చేసిన న్యాయమూర్తి నిందితులు గుగులోత్ ఉపేందర్, దేవేందర్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ముదిరాజులను బీసీ 'ఏ'లోకి మార్చాలి

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 27 : ముదిరాజులను బీసీ డీ గ్రూప్ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని మత్స్య సొసైటీ అధ్యక్షుడు మునిగెల వెంకటేశ్వర్లు, జిల్లా డైరెక్టర్ బూర్ల శంకర్ కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. ముదిరాజు మహా సభ మండల అధ్యక్షుడు లింగనబోయిన శ్రీనివాస్, కార్యదర్శి మునిగల రాజు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత

సదస్సులో మాట్లాడుతున్న జడ్జి సుచరిత

జనగామ, జూలై 27 (నమస్తే తెలంగాణ) : ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థుల భవిష్యత్ అంధకారమవుతుందని జనగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ సుచరిత అన్నారు. జిల్లా న్యాయ సేవ సంస్థ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిషేధ చట్టంపై శనివారం స్థానిక ఏబీవీ జూనియర్ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా ర్యాగింగ్ చేస్తున్నట్లు అనుమానం వస్తే కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థినులు ఇంటికి వెళ్లేటప్పుడు ఎవరు అనుసరిస్తున్నారో, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారో తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ కనకరాజు, చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రవీంద్ర, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ జోత్స్న, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీహరి పాల్గొన్నారు.

వినియోగదారుల కమిషన్ రాష్ట్ర డిప్యూటీ చైర్మన్‌గా భాస్కర్‌పవార్

నియామక పత్రాన్ని అందుకుంటున్న భాస్కర్ పవార్

జనగామ, జూలై 27 (నమస్తే తెలంగాణ) : వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర డిప్యూటీ చైర్మన్‌గా జనగామకు చెందిన భాస్కర్‌పవార్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్‌లో శనివారం నిర్వహించిన సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భాస్కర్ పవార్ బాధ్యతలు చేపట్టారు. రెండు దశాబ్దాలుగా వివిధ రంగాల్లో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ పదవి లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు చట్టపరమైన హక్కులపై అవగాహన లేక అనేక మంది నష్టపోతున్నారన్నారు. ఆన్‌లైన్, సైబర్ మోసాలతోపాటు నాణ్యత లేని వస్తువులపై అవగాహన కల్పించి వారికి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. జిల్లా స్థాయిలో వినియోగదారుల హక్కుల కమిషన్ ఉంటుందని, వస్తు సేవల్లో లోపాలు జరిగితే ఫిర్యాదు చేయవచ్చన్నారు. తనకు ఈఅవకాశం కల్పించిన తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నలమస శ్రీకాంత్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సర్కారు పాఠశాలల్లో బోనాలు

దేవరుప్పుల, జూలై 27: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీకైన బోనాల పండుగను మండలంలోని మాధాపురం ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ, శ్రావణ మాసాల్లో గ్రామాల్లో బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు నల్ల లలిత అన్నారు. లష్కర్ బోనాల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ పీ శ్యామల, అంగన్‌వాడీ టీచర్లు విజయ, రజిత, ఉపాధ్యాయుడు గోలి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ లో బోనాల పండుగ ను ఘనంగా నిర్వహించారు. ఎస్ఎస్ఎస్, సాంస్కృతిక విభాగం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో పోతరాజులు, శివసత్తులతో విద్యార్థుల విన్యాసాలు అబ్బురపర్చాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డీ శ్రీకాంత్, ఎస్ఎస్ఎస్ ప్రోగాం అధికారి జానీనాయక్, సాంస్కృతిక విభాగం కోఆర్డినేటర్ మహేందర్, కిరణ్‌కుమార్, కందగట్ల గణేశ్, వెంకటేశ్వర్లు, రాజు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులు

దేవరుప్పుల: బోనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

శుభ కార్యాలకు అద్దెకు ఆర్టీసీ బస్సులు

జనగామ, జూలై 27 (నమస్తే తెలంగాణ) : శ్రావణ మాసం ఆగస్టు నుంచి ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా వివాహాది శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని జనగామ డిపో మేనేజర్ ఎస్ స్వాతి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సురక్షితమైన ప్రయాణం, తక్కువ ఖర్చుతో పెళ్లిళ్లు, శుభాకార్యాలు, తీర్థ యాత్రల కోసం పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు స్వాతి వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పల్లవి

కొడకండ్ల, జూలై 27 : ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ అండ్ టెక్నాలాజీ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన పరీక్షలో మండల కేంద్రంలోని గురుకుల కళాశాలకు చెందిన జక్కుల పల్లవి ప్రతిభ చూపింది. దీంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. కొడకండ్ల గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పల్లవి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవడంతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు 20మంది ఎంపిక

జనగామ, జూలై 27 (నమస్తే తెలంగాణ) : అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ధర్మకంచ మినీ స్టేడియంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు జరిగాయని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి దాదాపు 200మంది బాలబాలికలు హాజరవగా, రాష్ట్ర స్థాయి పోటీలకు 20మంది క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 7న హైదరాబాద్ సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి ఆవుల అశోక్, కిష్టయ్